టీబీ డ్యాం నుంచి ఆర్డీఎస్‌కు నీళ్లు

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ చొరవ ఫలితం
- కృతజ్ఞతలు తెలిపిన ఆయకట్టు రైతులు

అలంపూర్, జనవరి 8 : బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి చొరవతో ఆర్డీఎస్ ఆయకట్టుకు నీరు చేరింది. తుంగభద్ర నదిలో నీటిమట్టం తగ్గిపోవడంతో నియోజక వర్గంలోని రైతులు తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా సాగు చేస్తున్న రెండో పంటకు తగినంత నీరందక ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ.. ఏపీ ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి తుంగభద్ర డ్యాం నుంచి మనకు లెక్క ప్రకారం రావాల్సిన వాటా నీటిని విడుదల చేయించారు. ఆర్డీఎస్‌లో రెండో ఇండెంట్‌లో భాగంగా టీఎంసీ నీటిని డ్యాం నుంచి బుధవారం విడుదల చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ.. రాబోయే మూడ్రోజుల్లో నది ద్వారా తుమ్మిళ్ల ఎత్తిపోతల వరకు నీరు చేరనున్నట్టు తెలిపారు. ఎత్తిపోతల నుంచి ఆర్డీఎస్ కెనాల్ ద్వారా ఆర్డీఎస్ ఆయకట్టుకు చేరుతుందని చెప్పారు. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు.

కేటీపీపీలో విద్యుత్తు ఉత్పత్తి పునఃప్రారంభం

గణపురం, జనవరి 8: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని చెల్పూర్ కాకతీయ థర్మల్ విద్యుత్తు కేంద్రంలో బుధవారం నుంచి విద్యుత్తు ఉత్పత్తి పునఃప్రారంభమైంది. కేటీపీపీ రెండో దశ 600 మెగావాట్ల ప్లాంటును 45 రోజుల పాటు ఓవరాలింగ్ మరమ్మతు పనులు కోసం నవంబర్ 15న విద్యుత్తు ఉత్పత్తిని అధికారులు నిలిపివేశారు. 45 రోజులపాటు మరమ్మతులు పూర్తి చేసి విద్యుత్తు ఉత్పత్తిని పునఃప్రారంభించారు.

కేటీఆర్‌పై క్విడ్‌ప్రోకో కుట్ర!

- హైటెక్ సిటీ భూములకు, ఫార్ములా ఈ-కార్ రేసు కేసుకు సర్కార్ లంకె
- అనుకూల పత్రికల్లో విష ప్రచారం
- సుప్రీంకోర్టులో కేసున్న ప్రైవేట్ భూమిపై క్విడ్‌ప్రోకో ఎలా సాధ్యం?
- ఇది అసాధ్యమని తెలిసినా బట్టకాల్చి మీద వేసేలా కథనాల వండివార్పు

రేసు కేసులో పసలేక.. భూముల కుట్ర!

కేటీఆర్‌ను ఎలాగైనా జైలుకు పంపించాలనే పతంతో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్టు రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఇందులో భాగంగానే ఫార్ములా ఈ రేస్ కేసును పావుగా వాడుకుంటున్నారనే విమర్శలున్నాయి. ఈ కేసులో పస లేదని గ్రహించి, ఇప్పుడు కొత్త కుట్రకు తెరలేపారన్న విమర్శలు వస్తున్నాయి. అసలు సంబంధమే లేని ఫార్ములా-ఈ కార్ రేసుకు హైటెక్ సిటీ భూములకు లంకె పెట్టడం కుట్రలో భాగమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ ఈ-కార్ రేసు కేసు వీగిపోతే దీనికి హైటెక్ సిటీ భూములను లింకు చేయడం ద్వారా కేసును మరో కోణంలో తిప్పాలనే కుట్ర చేస్తున్నట్టుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ) : సవాలక్ష వివాదాలతో సుప్రీంకోర్టులో కేసులున్న భూమిపై.. అదీ ప్రభుత్వంతో సంబంధం లేని, ప్రైవేట్ వ్యక్తులకు చెందిన భూమిపై క్విడ్‌ప్రోకో (ఇచ్చి పుచ్చుకోవడం) సాధ్యమవుతుందా? కానీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుకూల పత్రికలు దీన్ని సుసాధ్యం చేసి చూపిస్తున్నాయి. మాజీ మంత్రి కేటీఆర్‌పై బురదజల్లడమే లక్ష్యంగా రోజుకో రకం కథనాలను వండి వారుస్తున్నాయి. ఫార్ములా-ఈ కార్ రేస్‌లో హైటెక్ సిటీలోని వివాదాస్పద భూములకు సంబంధించి క్విడ్ ప్రోకో జరిగినట్టు తప్పుడు ప్రచారానికి తెరతీశాయి. ఇందుకు సంబంధించి బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి అనుకూల పత్రిక ఓ విష కథనాన్ని వడ్డించింది. ఆ కథనంలోనే సదరు పత్రిక పలు కీలక అంశాలు కూడా వెల్లడించింది. ఈ భూమి పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులదని తేల్చింది. దీని కోసం ఐదారు హౌసింగ్ సొసైటీలు, ఓ సంస్థ కూడా కొట్లాడుతున్నట్టు పేర్కొన్నది. దీనిపై కింది కోర్టుల నుంచి సుప్రీంకోర్టు దాకా కేసులున్నట్టు పేర్కొన్నది. ఇన్ని రకాల ఇబ్బందులున్న భూముల్లో మళ్లీ కేటీఆర్ ఒక సంస్థకు మేలు చేసేలా క్విడ్ ప్రోకోకు పాల్పడ్డారని ఆరోపణలు చేసింది. ఓ వైపు క్విడ్ ప్రోకోకు అవకాశం లేదని చెప్తూనే మరోవైపు కేటీఆర్‌పై బురదజల్లే ప్రయత్నం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రైవేటు సంస్థల ఒప్పందంతో కేటీఆర్‌కు ఏం సంబంధం?

హైటెక్ సిటీ సమీపంలోని 1007 సర్వే నంబర్‌లో 240 ఎకరాల వివాదాస్పద భూమి ఉన్నది. ఈ భూమి తమదంటే తమదంటూ పలువురు వ్యక్తులు, సంస్థల మధ్య వివాదాలు నడుస్తున్నాయి. పలువురు ముస్లింలు ఈ భూమి తమదని వాదిస్తుంటే.. ఐదారు హౌసింగ్ సొసైటీలు తమదని వాదిస్తున్నాయి. ఇదిలా ఉంటే ప్రైమ్ ప్రాపర్టీస్ అనే సంస్థ ఈ భూమి తమదని, దీన్ని తాము కొనుగోలు చేశామని చెప్తున్నది. ఈ సంస్థతో గ్రీన్ కో సంస్థ ఒప్పందం చేసుకున్నది. ఈ భూ వివాదం సుప్రీంకోర్టులో ఉన్నది. ఇంకా తీర్పు రాలేదు. ప్రస్తుతం ఈ భూమిపై కేసులు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే ఈ భూమి తమదని వాదిస్తున్న ప్రైమ్ ప్రాపర్టీస్ సంస్థ సదరు భూమిని జాయింట్ డెవలప్‌మెంట్ కోసం గ్రీన్‌కో సంస్థతో ఒప్పందం చేసుకున్నది. ఈ ఒప్పందం కేటీఆర్ వల్లే అయ్యిందంటూ సదరు పత్రిక ఆరోపించింది. ఫార్ములా-ఈ కార్ రేసులో గ్రీన్‌కో కంపెనీకి అనుబంధంగా ఉన్న సంస్థ భాగస్వామిగా ఉండటంతో ఆ పత్రిక ఇలా ఆరోపణలకు పూనుకున్నట్టు తెలుస్తున్నది. సదరు గ్రీన్‌కో కంపెనీ ఒక వ్యాపార సంస్థగా ప్రైవేట్ ప్రాపర్టీస్‌తో ఒప్పందం చేసుకున్నది. ఇది రెండు ప్రైవేట్ సంస్థల మధ్య జరిగిన ఒప్పందం మాత్రమే! దీన్ని బోడిగుండుకు, మోకాలికి లింకు పెట్టినట్టుగా ఫార్ములా ఈ కేసుకు, భూములకు లింకు పెట్టి కేటీఆర్‌పై దుష్ప్రచారం చేస్తున్నారు. రెండు ప్రైవేట్ సంస్థల మధ్య ఒప్పందం జరిగితే దానితో కేటీఆర్‌కు ఏం సంబంధమనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. సదరు పత్రిక కూడా ఎక్కడా నిర్దిష్టమైన ఆధారాలతో కథనం రాయలేదు. ఆరోపణలు, అభాండాలతోనే కథనాన్ని వండి వార్చినట్టు స్పష్టమవుతున్నది. ఇది కేవలం కేటీఆర్‌పై బురదజల్లేందుకే తప్ప మరోటి లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మనీలాండరింగ్.. ఎలక్టోరల్ బాండ్లు.. భూములు

ఫార్ములా ఈ రేస్ కేసులో పసలేక పోవడంతో రేవంత్ సర్కార్ రోజుకో దుష్ప్రచారం చేస్తున్నది. 55 కోట్ల రూపాయల ఒప్పందాన్ని అమాంతం 600 కోట్లకు పెంచింది. ఇందులో కేటీఆర్‌కు విదేశీ కంపెనీ నిధులు మళ్లించిందని తొలుత ఆరోపణలు చేసింది. కానీ ఎలాంటి ఆధారాలనూ చూపలేదు. దీంతో గ్రీన్ కో సంస్థ ఎలక్టోరల్ బాండ్లను బీఆర్ఎస్‌కు ఇచ్చిందని, అందుకే ఆ సంస్థకు ఫార్ములా ఈ రేసు నిర్వహణ బాధ్యతలు అప్పగించారని ప్రచారం చేసింది. ఈ వాదనలోనూ పసలేదని తేలిపోయింది. గ్రీన్ కో కాంగ్రెస్ పార్టీకి కూడా భారీగా ఎన్నికల నిధులను సమకూర్చింది. దీంతో ఏం చెయ్యాలో తోచని రేవంత్‌రెడ్డి, తన అనుకూల మీడియా ద్వారా కేటీఆర్‌పై తప్పుడు ప్రచారానికి దిగారనే వాదనలు వినిపిస్తున్నాయి. కేటీఆర్‌కు సంబంధమే లేని అంశాలను తెరమీదికి తెచ్చి ప్రజల్లో అయోమయం సృష్టించాలన్న ఆలోచనతోనే ఇలాంటి కుట్రలకు తెరలేపుతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బకాయిల నిలిపివేతపై అనుమానాలు

- బిల్లులు క్లియర్ చేయడంలో ఎవరికి ప్రాధాన్యం?
- బూమ్‌బూమ్, బిర్యానీ బీర్లు తెచ్చేందుకు యత్నం?
- ఉద్దేశపూర్వకంగానే నిలిపివేశారా?: హరీశ్‌రావు
- యూబీ కంపెనీకి బకాయిలు రూ.658.95 కోట్లే
- మీడియాతో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): బీర్ల ఉత్పత్తి కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు నిలిపివేయడంపై ఎన్నో అనుమానాలు తలెత్తుతున్నాయని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్ వేదికగా తన అభిప్రాయం వ్యక్తంచేశారు. తెలంగాణ ప్రభుత్వానికి యునైటెడ్ బ్రూవరీస్ బీర్ సరఫరాను నిలిపివేయాలని తీసుకున్న నిర్ణయం ఎన్నో ప్రశ్నలను లేవనెత్తుతున్నదని హరీశ్‌రావు పేర్కొన్నారు. రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ బీరు సరఫరాకు సంబంధించి బకాయిలు చెల్లించడంలో విఫలమైందని యునైటెడ్ బేవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్ చెప్పిందని తెలిపారు. యునైటెడ్ బ్రూవరీస్ బీరు విక్రయాలను నిలిపివేయడం వల్ల తెలంగాణలో కింగ్‌ఫిషర్, హీనెకెన్ వంటి ప్రీమియం బ్రాండ్ల లభ్యతకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. బూమ్ బూమ్, బీర్యానీ బీర్ల వంటి స్థానిక బ్రాండ్లను ప్రచారం చేయడానికి ఇది ప్రభుత్వ ఉద్దేశపూర్వక ప్రయత్నమా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. సీనియారిటీ, మెరిట్‌కు కట్టుబడకుండా కమీషన్లకు బిల్లులను క్లియర్ చేయడంలో నేటి ప్రభుత్వం పాటిస్తున్న 'ప్రాధాన్యం' కారణంగా ఈ పరిస్థితి తలెత్తిందా? అని నిలదీశారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం సీనియారిటీ ఆధారంగా బిల్లులను క్లియర్ చేసేదని తెలిపారు.

యూబీ కంపెనీకి బకాయిలు రూ.658.95 కోట్లే

బీర్ల ధరల పెంపు అనేది హైకోర్టు విశ్రాంత జడ్జి నేతృత్వంలోని ధరల నిర్ణయ కమిటీ పరిశీలనలో ఉన్నదని, ఆ కమిటీ నివేదిక వచ్చాక.. దానిని పరిశీలించి ధరల పెంపుపై నిర్ణయం తీసుకుంటామని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం మీడియాతో చెప్పారు. కమిటీ నివేదిక ఇవ్వకముందే బేవరేజెస్ కార్పొరేషన్‌పై ఒత్తిడి తీసుకురావడం సరికాదని చెప్పారు. రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయంలో యూబీఎల్‌ది 70 శాతం గుత్తాధిపత్యం ఉండటం వల్లే ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. వారి ఒత్తిళ్లకు తమ ప్రభుత్వం తలొగ్గదని పేర్కొన్నారు. యూబీకి 2023 డిసెంబర్ 7నాటికి రూ.407.34 కోట్లు చెల్లించాల్సి ఉన్నదని, అప్పట్నుంచి 2025 జనవరి 7 వరకు మొత్తం రూ.1,130.99 కోట్ల బకాయిలను క్లియర్ చేశామని చెప్పారు. యూబీ కంపెనీకి ప్రస్తుతం రూ.658.95 కోట్లు బకాయి చెల్లించాల్సి ఉన్నదని మంత్రి వివరించారు. బీర్ల ధరలు 33.1 శాతం పెంచాలని యూబీ కంపెనీ కోరుతున్నదని, ధరలు పెంచితే మద్యంప్రియులపై భారం పడుతుందని తెలిపారు.

కింగ్‌ఫిషర్ బీర్లు బంద్!

మొదటిపేజీ తరువాయి...

క్లిష్టతరం చేశాయి' అని ఆ లేఖలో పేర్కొన్నది. బ్రూవర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) రాష్ట్ర ప్రభుత్వానికి తమ ద్రవ్యోల్బణాన్ని తగ్గించడానికి, ధరల పెంపుదలపై అనేకసార్లు వినతులు ఇచ్చినా, నేటికీ ఎటువంటి పరిష్కారం లేదని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకొని, తమతో కలిసి పనిచేయాలని తాము కోరుతున్నామని ఆ లేఖలో కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు. బీర్ల సరఫరాకు సంబంధించి తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ సుమారు రూ.1000 కోట్ల వరకు బకాయి పడిందని, ఆ బిల్లులు చెల్లించకపోవడంతో కంపెనీ తీవ్రంగా నష్టపోతున్నదని యునైటెడ్ బ్రేవరేస్ లిమిటెడ్ పేర్కొన్నది. సెబీ లిస్టింగ్ రెగ్యులేషన్ 30 ప్రకారం తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్‌కి కింగ్‌ఫిషర్, హీనెకెన్ బీర్ల సరఫరాను తక్షణమే నిలిపివేస్తున్నట్టు తెలిపింది.

మేఘాకు కొడంగల్ లిఫ్ట్ పనులే అసలైన క్విడ్‌ప్రోకో

- 'రాఘవ', మేఘాకు ఏ ప్రాతిపదికన కట్టబెట్టారు?
- ఎల్‌అండ్‌టీ, నాగార్జున కంపెనీల బిడ్లను ఏ లెక్కన తిరస్కరించారు?
- క్విడ్‌ప్రోకోలో మీ వాటా ఎంత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డీ?
- కాంగ్రెస్ బహిష్కృత నేత జడ్సన్

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): కొడంగల్ లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను ప్రఖ్యాత ఎల్‌అండ్‌టీ, నాగార్జున కంపెనీలను కాదని.. మేఘా ఇంజినీరింగ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు ఏ ప్రాతిపదికన కట్టబెట్టారని కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. 'క్విడ్‌ప్రోకో కింద మీకు దక్కిన వాటా ఎంత?' అని సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో బుధవారం బక్క జడ్సన్ మీడియాతో మాట్లాడుతూ.. కొడంగల్ ఎత్తిపోతల పనులను మేఘా, రాఘవ కంపెనీలకు కట్టబెట్టడం వెనుక రూ.2వేల కోట్ల స్కాం ఉన్నదని ఆరోపించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ విషయంపై తానిచ్చిన ఫిర్యాదుపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఎల్‌అండ్‌టీ, నాగార్జున కంపెనీలను ఏ లెక్కన తిరస్కరించారని ప్రశ్నించారు. మేఘా కంపెనీ నిర్లక్ష్యంతోనే సుంకిశాలలో రిటైనింగ్ వాల్ కూలిందని, ఆ సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టాలని అధికారులు నివేదిక ఇచ్చినా పనులు అప్పగించారని తెలిపారు. క్విడ్‌ప్రోకోతో దొరికిన రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలన్నారు. దీనిపై ఏసీబీ కేసు నమోదు చేయకపోతే సుప్రీంకోర్టుకు వెళ్తానని హెచ్చరించారు.



డాక్టర్ కృష్ణా ఎల్లాకు ఐఎన్ఎస్ఏ ఇండియా ఫెలోషిప్ ప్రదానం చేస్తున్న ప్రతినిధులు

డాక్టర్ కృష్ణా ఎల్లాకు ప్రతిష్టాత్మక పురస్కారం

ఐఎన్ఎస్ఏ ఇండియా ఫెలోషిప్ ప్రదానం

హైదరాబాద్, జనవరి 8(నమస్తే తెలంగాణ): ప్రముఖ శాస్త్రవేత్త, భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ కోఫౌండర్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ కృష్ణా ఎంఎల్లాను ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ(ఐఎన్ఎస్ఏ) ప్రతిష్టాత్మక ఇండియా ఫెలోషిప్‌తో సత్కరించింది. నూతన విజ్ఞానం, ఆవిష్కరణలు, కొత్త వ్యాక్సిన్ టెక్నాలజీల అభివృద్ధి, ఇప్పటికే ఉన్న సాంకేతికతల అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషికి ఈ గౌరవం దక్కింది. ఇటీవల చెన్నైలో జరిగిన ఐఎన్ఎస్ఏ 90వ వార్షికోత్సవం సందర్భంగా కృష్ణా ఎల్లాకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. దీంతో కృష్ణా ఎల్లా, భారత్ అటామిక్ ఎనర్జీ కమిషన్ చైర్మన్ డాక్టర్ అనిల్ కాకోడ్కర్, డీఆర్‌డీవో మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వీకే సారస్వత్, ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్, ఇన్ఫోసిస్ కో ఫౌండర్ ఎస్ క్రిస్ గోపాలకృష్ణన్ తదితర విశిష్ట శాస్త్రవేత్తల జాబితాలో చేరారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణా ఎల్లా మాట్లాడుతూ టీకాలు, బయోటెక్నాలజీలో తన కృషికి గుర్తింపు లభించటం సంతోషకరమని తెలిపారు. నూతన వ్యాక్సిన్లను కనుగొనడంలో భారత్‌ను ఆధిపత్య శక్తిగా మార్చేందుకు, ప్రజారోగ్య రంగంలో స్వావలంబన సాధించేందుకు తన కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. తనకు ప్రేరణగా నిలిచిన భారత్ బయోటెక్ బృందంతో ఈ గౌరవాన్ని పంచుకుంటున్నట్టు తెలిపారు. కాగా, వ్యాక్సిన్ల ఆవిష్కరణ, తయారీ, పంపిణీలో మూడు దశాబ్దాల అనుభవం ఉన్న భారత్ బయోటెక్.. 125 దేశాలకు 9 బిలియన్లకన్నా అధిక మోతాదులో వ్యాక్సిన్లను పంపిణీ చేసి ముందంజలో ఉన్నది. ప్రస్తుతం ఈ కంపెనీ 18 వ్యాక్సిన్లను తయారు చేస్తున్నది. అలాగే, ఐఎన్ఎస్ఏ 1935 నుంచి సైంటిఫిక్ అకాడమీలు, సొసైటీలు, సంస్థలు, ప్రభుత్వ వైజ్ఞానిక విభాగాల మధ్య సమన్వయాన్ని సాధిస్తూ శాస్త్రీయ పరిజ్ఞానాన్ని ప్రోత్సహించేందుకు కృషిచేస్తున్నది.

..ఆర్థిక సంక్షోభమా?

మొదటిపేజీ తరువాయి...

పేర్కొన్నారు. ప్రపంచ నగరాలకు ధీటుగా హైదరాబాద్ తెలంగాణకు ఉన్నదని, తెలంగాణ చిన్న రాష్ట్రమే అయినా ఆర్థిక పరిపుష్టికి అవసరమైన వనరులున్నాయని వివరించారు. ఇటువంటి రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిలో సమతూకం పాటించాలని సూచించారు. ఇటువంటి పచ్చని రాష్ట్రం ప్రభుత్వ విధానాల వల్ల సంక్షోభంలోకి వెళ్లొద్దని, దురదృష్టవశాత్తు ఆ అవకాశాలు కనిపిస్తున్నాయని హెచ్చరించారు.

నిర్ణయం నేరం ఎలా అవుతుంది?

ప్రజా ప్రభుత్వాలకు ఫ్యూడల్ మనస్తత్వాలు సరికాదని జయప్రకాశ్ నారాయణ స్పష్టంచేశారు. ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంపై లోతుపాతులు తనకు తెలియదని పేర్కొంటూనే, జరుగుతున్న పరిణామాలపై ఆయన తనదైన శైలిలో స్పందించారు. 'ఒక ప్రభుత్వం విధాన నిర్ణయం, పరిపాలనా నిర్ణయం తీసుకున్నట్టయితే, దురుద్దేశపూర్వకంగా నిర్ణయాలు తీసుకున్నారనే ఆధారాలు ఉంటే తప్ప, లంచం తీసుకున్నారు, అవినీతికి పాల్పడ్డారు అనే ఆధారాలు ఉంటే తప్ప నిర్ణయం తప్పు అనడానికి వీల్లేదు' అని పేర్కొన్నారు. నిర్ణయం నేరం ఎలా అవుతుంది? అని ప్రశ్నించారు. 'నాలుగు రోజులు ప్రచారంలో ఉండటం, ఒకపక్షం అవమానంతో ఉండటం, మరోపక్షం విజయగర్వంతో ఉండటం.. రేపు అధికార మార్పిడి అయ్యాక ఇటుదటు... అటుదిటుగా ఉండటమే పాలనగా సాగిపోయింది' అని వ్యాఖ్యానించారు. 'డీమానిటైజేషన్ ఉద్దేశం మంచిదే. మొదట్లో సమర్థించాను. తరువాత ఇది మంచిది కాదనే నిర్ణయానికి వచ్చాం. కానీ, దానిలో నేరం లేదు. ప్రభుత్వం ముందుచూపు లేకనో, సరైన సమాచారం లేకనో, తొందరపాటుగానో కొన్ని నిర్ణయాలు తీసుకోవచ్చు. అది మానవ సహజం. అంతమాత్రన దానిని నేరంగా చిత్రీకరించకూడదు' అని అభిప్రాయపడ్డారు. 'ఆ నిర్ణయంలో అవినీతి ఉన్నట్టయితే.. అందువల్ల స్వప్రయోజనం పొందే ప్రయత్నం ఉన్నట్టయితే (రాజకీయ ప్రయోజనం వేరు), లంచం తీసుకున్నట్టయితే, బుద్ధిపూర్వకంగా, దురుద్దేశపూర్వకంగా చేసినట్టయితే.. అది నేరం అవుతుంది కానీ, ఊరికెనే నేరంగా ప్రచారం చేయడం మంచిది కాదు' అని వ్యాఖ్యానించారు. నేర పరిశోధన లేకుండా తీర్పులు ఇచ్చే సంస్కృతి పెరిగిపోవడం బాధాకరమని అనన్నారు. చట్టం అందరికీ సమానంగా ఉండాలని, ప్రస్తుతం దేశంలో సాగుతున్నది రాజకీయ డ్రామా అని, అది దేశ ప్రయోజనాలకు శ్రేయస్కరం కాదని స్పష్టంచేశారు.

బడితె ఉన్న వాడిదే బర్రె!

రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా బుద్ధిపూర్వకంగా సొంతలాభం కోసం లంచం (కన్సిడరేషన్ ఫర్ డెసిసెషన్) ఆశించి ఏవైనా నిర్ణయాలు తీసుకున్నారని నిరాధారపూరితంగా అభాండాలు వేయడం మంచిది కాదని జయప్రకాశ్ నారాయణ హితవు చెప్పారు. ఏదో రకంగా బద్నాం చేయడమే రాజకీయంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. 'ఏదోరకంగా నాలుగుసార్లు స్టేషన్‌కు పిలవడం, లేదంటే అరెస్టు చేయడం, జైల్లో పెట్టడం.. దానినే గొప్పగా సాధించామని అనుకోవడం ఫ్యూడల్ రాజ్యం లాంటిది. ప్రభుత్వాలకు అటువంటి మనస్తత్వాలు ఉండకూడదు. దురదృష్టవశాత్తు అధికార యంత్రాంగం రాజభక్తిని ప్రదర్శిస్తున్నది' అని విమర్శించారు. 'ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టబద్ధపాలన జరగాలని, దురదృష్టవశాత్తు 'బడితె ఉన్నవాడితే బర్రె' అన్నట్టుగా సాగిపోతున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రతీకార చర్యలు ఏ వ్యవస్థకూ మంచిది కాదని పేర్కొన్నారు. ఎన్నికల ద్వారా అధికారం మారొచ్చు కానీ ప్రభుత్వం శాశ్వతంగా ఉంటుందని, అధికారం మారినా అధికారులు మారరని చెప్పారు.

కక్షపూరిత రాజకీయాలతో ప్రయోజనం లేదు

కక్షపూరిత రాజకీయాలు ఎవరికీ ప్రయోజనం కాదని జయప్రకాశ్ నారాయణ స్పష్టంచేశారు. 'బస్తీమే సవాల్' అనే సంస్కృతి పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజాస్వామ్యంలో ప్రత్యేకించి రాజకీయాల్లో బద్ధవిరోధులు ఉండరు కానీ, ప్రత్యర్థులు ఉంటారని చెప్పారు. సిద్ధాంతాల్లో రాజీలేకుండా బద్ధ ప్రత్యర్థి అయినా సరే సామరస్యంగా మాట్లాడుకోవాలని అయితే, ఆ వాతావరణం కొరవడిందని చెప్పారు. రాజకీయ విభేదాలు పరస్పర పగలకు దారితీయొద్దని ఆకాంక్షించారు.

మచ్చలేని నాయకుల ఆదర్శాలకు విలువ ఇవ్వాలి

మహాత్మాగాంధీ, అంబేద్కర్, పీవీ నరసింహారావు, వాజపేయి, మన్మోహన్‌సింగ్ వంటి మచ్చలేని నాయకుల ఆదర్శాలకు విలువ ఇవ్వాలని, వారి ఆదర్శాలను అనుసరించాలని జయప్రకాశ్ నారాయణ సూచించారు. అయితే, కేవలం విగ్రహాలు మాత్రమే పెడ్తాం వారి విలువలను ఆచరించం అన్నట్టుగా వ్యవస్థ మారిపోయిందని చురకలేశారు. 'మన్మోహన్ సింగ్ జీవితకాలం చిత్తశుద్ధితో పనిచేసిన నిలువెత్తు నిజాయితీ. వారి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే తప్పు లేదు. అదే సమయంలో వారి ఆదర్శాలను పాటించం అన్నట్టుగా వ్యవహరిస్తే విగ్రహం పెట్టి ఏం లాభం?' అని ప్రశ్నించారు.

స్వాతంత్ర్య సమరయోధురాలు లచ్చవ్వ మృతి

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 8: సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లికి చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు జంగిటి లచ్చవ్వ (95) కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బుధవారం మరణించారు. 1948లో బైరాన్‌పల్లి కేంద్రంగా రజాకార్లకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో లచ్చవ్వ పోరాటాన్ని గ్రామస్థులు గుర్తుచేసుకున్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె మృతిపై రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్థులు సంతాపం తెలిపారు.

డిజిటల్ అరెస్టులపై టీజీసీఎస్‌బీ అవగాహన

హైదరాబాద్, జనవరి 8 (నమస్తే తెలంగాణ): డిజిటల్ అరెస్టులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయెల్ చెప్పారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 394 సమావేశాలు, 23 ప్రాంతాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించినట్టు వెల్లడించారు. పోలీసులు గానీ, ప్రభుత్వ సంస్థల్లో పనిచేసేవాళ్ల పేరుతో ఎవరైనా డబ్బుల కోసం ఫోన్ చేస్తే స్పందించవద్దని సూచించారు.

కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

కోట: రాజస్థాన్‌లోని కోటాలో మంగళవారం రాత్రి నీరజ్ (19) అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ బుధరామ్ తెలిపిన వివరాలు.. హర్యానాలోని మహేంద్రగఢ్‌కు చెందిన నీరజ్ పన్నెండో తరగతి చదువుతున్నాడు. జేఈఈ కోసం రెండేళ్లుగా కోటాలో కోచింగ్ తీసుకుంటున్నాడు. ఆయన ఉంటున్న హాస్టల్ గది తలుపులను బుధవారం ఉదయం 10.30కు కేర్‌టేకర్ డోర్ కొట్టగా స్పందన లేదు. ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఇదిలావుండగా, నీరజ్ బాగా చదువుతాడని, తరగతులకు రెగ్యులర్‌గా హాజరవుతాడని ఆయన తండ్రి చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు తాను ఫోన్‌లో మాట్లాడినపుడు ఏం ఫిర్యాదు చేయలేదన్నారు. నీరజ్ మృతిపై దర్యాప్తు జరిపించాలని కోరారు.

సబ్ రిజిస్ట్రార్‌పై వేటు

మొదటిపేజీ తరువాయి...

రాష్ట్ర స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ కమిషనర్ బుద్ధప్రకాశ్ విచారణకు ఆదేశించారు. రంగంలోకి దిగిన జిల్లా సబ్ రిజిస్ట్రార్ హరికోట్ల రవి ఇతర అధికారులతో కలిసి యాదగిరిగుట్ట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించి, రిజిస్ట్రేషన్ల పత్రాలు పరిశీలించారు. 154 ప్లాట్లు అక్రమంగా రిజిస్ట్రేషన్ జరిగినట్టు గుర్తించారు. దీంతో బాధ్యుడైన యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్ గోపి నాయక్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు.

అంతా నా ఇష్టం!

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేర